డబ్బు చెల్లింపుల్లో
జాప్యం
» ఆన్‌లైన్ నమోదులో ఆలస్యం
» ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు
» ఐకేపీ అధికారుల
పనితీరుపై ఆగ్రహం 7

అయ్యో.. అన్నదాతా..
» అకాల వర్షానికి తడిసిన ధాన్యం
» చేతికొచ్చిన పంట నీటిపాలు 6
» విపత్కర పరిస్థితిలో రైతుల కంట తడి

డెంగీ డేంజర్ బెల్స్ 7
నేడు జాతీయ డెంగీ నివారణ దినోత్సవం



శ్రీశైలం డ్యాం నిర్మాణ సమయంలో ముంపునకు గురైన కృష్ణానది తీరంలోని ఈర్లదిన్నె గ్రామంలో గల 16వ శతాబ్దం నాటి రాజరాజేశ్వర ఆలయం ఇది. ఈ ఆలయాన్ని పరిరక్షించేందుకు 1983లో పిల్లలమర్రి పురావస్తు ప్రదర్శనశాల ప్రాంగణానికి తరలించి, పునర్నిర్మించారు.



సుందరీమణులు సందడి చేయనున్న పిల్లలమర్రి వృక్షం

సుందరీమణుల రాకకోసం..

ప్రపంచ సుందరీమణుల రాక కోసం పాలమూరు సిద్ధమైంది. మిస్ వరల్డ్-2025 పోటీదారులు ప్రముఖ పర్యాటక క్షేత్రం పిల్లల మర్రికి శుక్రవారం రానుండటంతో సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. క్షేత్రానికి రంగులు అద్దడంతో పాటు.. ఎటు చూసినా ఆకు పచ్చగా కనిపించేలా తీర్చిదిద్దారు. ముందుగా 16వ శతాబ్దం నాటి రాజరాజేశ్వర ఆలయాన్ని దర్శించుకోనున్న అందమైన భామలు.. ఆ తర్వాత పురావస్తు మ్యూజియాన్ని సందర్శించనున్నారు. 700 ఏళ్ల చరిత్ర కలిగిన పిల్లలమర్రిని చూసి తరించనున్నారు. అనంతరం ఫొటోలకు ఫోజులివ్వనున్నారు. అందమైన భామల రాక నేపథ్యంలో అందరి దృష్టి పాలమూరుపై పడింది.

- మహబూబ్‌నగర్

- నేడు పాలమూరుకు మిస్ వరల్డ్ పోటీదారులు
- సర్వాంగ సుందరంగా ముస్తాబైన పిల్లలమర్రి క్షేత్రం
- హైదరాబాద్ నుంచి రానున్న 22 మంది
- రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి దర్శనం
- మహావృక్షం కింద ఫొటోషూట్
- మెట్టుగడ్డ నుంచి పిల్లలమర్రి వరకు ఆంక్షలు
- బాలానగర్ నుంచి 1300 మంది పోలీసులతో మూడంచెల భద్రత

మిస్ వరల్డ్-2025 పోటీదారులు పాలమూరులో శుక్రవారం పర్యటించనున్నారు హైదరాబాద్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన నార్త్, సౌత్ అమెరికాకు 22 మంది సుందరీమణులు పట్టణంలోని పిల్లలమర్రిని సందర్శించనుండటంతో ఆ పర్యాటక ప్రదేశానికి ప్రపంచ ఖ్యాతి రానుంది. వారి పర్యటన కోసం అధికార యంత్రాంగం పది రోజుల నుంచి క్షేత్రాన్ని సుందరంగా ముస్తాబు చేస్తోంది. పర్యాటకులను ఆకర్షించేలా కొత్తరూపు సంతరించుకుంటోంది. తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలను ప్రపంచవ్యాపితం చేసే ప్రయత్నంలో భాగంగా పిల్లల మర్రిని సుందరీమణులు సందర్శించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేయడంతో ఇప్పుడు అందరిచూపు ఈ పర్యాటక ప్రాంతంపై పడింది. పాలమూరు జరూర్ ఆనా అన్న నినాదంతో యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు వారు ఇక్కడ ఉండనున్నారు. హైదరాబాద్ నుంచి మూడు ప్రత్యేక ఏసీ బస్సులలో సుందరీమణులు పిల్లలమర్రికి చేరుకుంటారు. దారి పొడవునా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

2 గంటలు ఏం చేయబోతున్నారు?

- అందాల భామలు 2 గంటల పాటు పిల్లలమర్రిలో గడిపేందుకు అధికార యంత్రాంగం కార్యక్రమాలను రూపొందించింది. ముందుగా ఇక్కడ రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని వారు దర్శించుకుంటారు.
- 16వ శతాబ్దం నాటి రాజరాజేశ్వర ఆలయం కృష్ణానది తీరంలోని ఈర్లదిన్నె గ్రామంలో ఉండేది. శ్రీశైలం డ్యామ్ నిర్మాణ సమయంలో ఏర్పడిన ముంపుతో ఈ ఆలయాన్ని పరిరక్షించేందుకు 1983లో పిల్లలమర్రి పురావస్తు ప్రదర్శన శాల ప్రాంగణానికి తరలించి, పునఃప్రతిష్ఠించారు. ఇక్కడ పూజలు

(మిగతా 6లో..)

సుందరంగా తీర్చిదిద్దుతున్న యంత్రాంగం

అందగత్తెల రాక కోసం పిల్లలమర్రిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అంతా పచ్చగా కనిపించేలా ల్యాండ్‌స్కేప్‌ను ఏర్పాటు చేస్తున్నారు. గోడలకు, రెయిలింగ్‌కు పెయింటింగ్ చేస్తున్నారు. ముఖద్వారాన్ని అందంగా తీర్చిదిద్దారు. ఆలయం ప్రాంగణాన్ని ఆకుపచ్చగా మార్చి, మొక్కలు నాటించారు. సందర్శకులు కూర్చునే పగోడాలకు అందంగా పెయింటింగ్ వేయించారు. చెట్టు మొదలుకు రంగులు అద్దారు. మెట్టుగడ్డ నుంచి పిల్లలమర్రి వరకు ఉన్న 3 కిలోమీటర్ల రహదారికి ఇరువైపుల చెత్తను తొలగించి, శుభ్రం చేస్తున్నారు. ఐజీ సత్యనారాయణ, ఎస్పీ జానకి బందోబస్తుపై, జిల్లా కలెక్టర్ విజయేందిరబోయి ఏర్పాట్లపై వారం రోజులుగా దృష్టి కేంద్రీకరించారు.

నిర్వాసితులకు అండగా ఉంటాం

» ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, మే 15(ఆంధ్రజ్యోతి) : పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో నిర్వాసితులుగా మారిన అందరికీ రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలో పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న బోరబండ తండా, సున్నపు తండా, వడ్డె గుడిసెలను కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీ పనుల వివరాలను అధికారులతో అడిగి తెలుసుకున్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని నిర్వాసితులు మంత్రిని కోరారు. ఎల్లూరు రిజర్వాయర్ స్లూయిస్ ద్వారా నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి నీళ్లు వస్తున్నందున సున్నపుతండాలో ఉన్న ఇళ్లు మునిగి పోయే ప్రమాదం ఉందని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో ఇళ్లు నిర్మిం చుకునే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో సర్వం కోల్పోయిన ప్రజలకు పూర్తిస్థాయిలో ప్రభుత్వం అండగా ఉంటుందని, నిర్వాసితులు ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కొల్లాపూర్ ఆర్డీవో భన్సీలాల్, వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.



నిర్వాసితులతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్

గిరిజనుల అభ్యున్నతికి పెద్దపీట

- నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి

కల్వకుర్తి, మే 15 (ఆంధ్రజ్యోతి) : నల్లమల చెంచు, గిరిజనుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గిరిజన రైతుల పోడు భూముల సాగుకు 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకంతో చేయూతనివ్వాలని ప్రభుత్వం ముందుకొచ్చిందని తెలిపారు. ఈనెల 18న సీఎం రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకంలో రాష్ట్రంలోని 5లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రూ.6వేల కోట్లు ప్రభుత్వం కేటాయించిందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతను విస్మరించి అన్ని కార్పొరేషన్లను నిర్వీర్యం చేయడంతో యువకులకు స్వయం ఉపాధి పథకాలు అందక ఇబ్బంది పడ్డారని తెలిపారు. సామాజిక న్యాయం కోసమే యువ వికాసంలో ఒక్కో లబ్ధిదారుడికి రూ.50వేల నుంచి రూ.4 లక్షల వరకు ఆర్థిక సాయం అందజేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలి పారు. బ్యాంక్ సిబిల్ స్కోర్‌తో సంబంధం లేకుండా అర్హులందరికీ అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మాజీ సభ్యుడు ఠాకూర్ బాలాజీసింగ్, మాజీ సర్పంచ్‌లు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ మల్లురవి

సుందరీమణుల రాకకోసం..

(5వ పేజీ తరువాయి)

చేసిన అనంతరం పురావస్తు మ్యూజియాన్ని సందర్శిస్తారు. ఈ మ్యూజియంలో జిల్లాకు చెందిన పలు గ్రామాలు, పట్టణాలలో సేకరించిన శిల్పాలు, శాసనాలు రాతియుగపు పనిముట్లు, హైదరాబాద్ స్టేట్ మ్యూజియం నుంచి సేకరించిన పంచలోహ విగ్రహాలు ఉన్నాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అల్వాల్‌పల్లి, గొల్లతగుడి, పూడూరు, నందివడ్డెమాన్, పాన్‌గల్, కల్వకోల్ ప్రాంతాలకు చెందిన హిందూ, బౌద్ధ, జైన మతాలకు శిల్పాలు భద్రపరిచారు. విజయనగర కుతుబ్‌సామిల కాలం నాటి ఆయుధాలు, విగ్రహాలు ఉన్నాయి. శాతవాహనుల నుంచి అసఫ్ జాహీ రాజుల వరకు ముద్రించిన వెండి, సీసపు, రాగి, బంగారు నాణెలు ప్రదర్శనకు ఉంచారు.

● మ్యూజియం తిలకించిన అనంతరం అక్కడినుంచి 700 ఏళ్ల చరిత్ర కలిగిన మహావృక్షం పిల్లల మర్రి కిందికి చేరుకుంటారు. వృక్షం చరిత్ర, ఇటీవల చెట్టు ఊడలు నేలకొరిగిన సమయంలో సెలైన్ ట్రీట్‌మెంట్ ద్వారా తిరిగి ఎలా నిలబెట్టగలిగారు? వంటి విషయాలను వివరించనున్నారు. అక్కడే ఫొటోషూట్ ఉంటుంది. బతుకమ్మలను ఉంచి, వాటి గురించి వివరించనున్నారు. క్లాసికల్ డ్యాన్స్ ప్రోగ్రామ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. అనంతరం అక్కడే స్నాక్స్ తిన్నాక తిరుగు ప్రయాణం కానున్నారు.



బుద్ధవనం చుట్టూ వేసిన పెయింటింగ్



పురావస్తు మ్యూజియం

పిల్లలమర్రి రహదారిపై ఆంక్షలు

సుందరీమణుల రాకతో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మెట్టుగడ్డ నుంచి పిల్లలమర్రికి వెళ్లే రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు విధించనున్నారు. ఈ రూట్‌లో వాహనాల రాకపోకలను బంద్ చేయనున్నారు. ఈ రూట్‌లో బోయపల్లి వైపు వెళ్లే వాహనాలన్నీ నగరంలో నుంచే వెళ్లాల్సి ఉంటుంది. దాదాపు 1,000 మంది సివిల్ పోలీసులు, మరో 300 వరకు ఏఆర్ పోలీసులతో మూడంచెల బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి పాలమూరునుంచి బలగాలను నగరానికి తరలించారు. జిల్లా సరిహద్దు అయిన బాలానగర్ నుంచి దారిపొడవునా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఇక నగరం, ముఖ్యంగా మెట్టుగడ్డ నుంచి మహావృక్షం పిల్లలమర్రి వరకు అడుగడుగునా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. పిల్లలమర్రిలో సుందరీమణుల చుట్టూ 200 మంది మహిళా పోలీసులు బందోబస్తులో ఉండనున్నారు. వీరికి బ్లూ కలర్‌లో సఫారీ సూట్(డ్రెస్ కోడ్) కొనుగోలు చేసి పంపిణీ చేశారు. మరోవైపు ఇదివరకే పోలీస్‌శాఖ పిల్లలమర్రి చుట్టూ ఉండే గ్రామాలు, తండాలలో నివాసం ఉంటున్న వారి వివరాలు సేకరించింది. ఆయా ప్రాంతాలపై నిఘాను ఉంచింది. అనుమానితులు, కొత్త వ్యక్తుల కదలికలు ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని నమ్మకమైన వ్యక్తులకు సమాచారం అందించారు. పోలీసులు కూడా కొందరు చుట్టూ గ్రామాలపై నజర్ ఉంచారు. ఎక్కడ ఎలాంటి అనుమానం ఉన్నా అదుపులోకి తీసుకోనున్నారు. మొత్తంగా సుందరీమణులు వచ్చి తిరిగి వెళ్లే వరకు పోలీస్‌శాఖ పూర్తి అప్రమత్తతో ఉండనుంది.



పిల్లలమర్రి చిల్డ్రన్స్ పార్క్ వద్ద పెయింటింగ్ వేస్తున్న కార్మికులు



పిల్లలమర్రి ఆవరణలో పచ్చగా ల్యాండ్‌స్కేప్

సర్వం సిద్ధం

» కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొంటున్న సుందరీమణుల పిల్లలమర్రి పర్యటనకు సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రిలో ప్రపంచ సుందరీమణుల పర్యటన ఏర్పాట్లను ఎస్పీ డి.జానకి, అదనపు కలెక్టర్లు మోహన్ రావు, శివేంద్ర ప్రతాప్‌లతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 22 దేశాల సుందరీమణులు శుక్రవారం సాయంత్రం 5 గంటలకు పిల్లలమర్రి పర్యాటక కేంద్రానికి చేరుకుంటారన్నారు. ఈ నేపథ్యంలో వారికి స్వాగతం పలకడం, పిల్లలమర్రిలో ఏర్పాటు చేసిన చారిత్రక కళాఖండాలు. శిల్ప కళలను తిలకించడం, దాదాపు మూడున్నర ఎకరాలు విస్తరించి ఉన్న మర్రి చెట్టు విశిష్టతను వివరించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. వారి రాక సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వారి పర్యటన అత్యంత ఆహ్లాదకర వాతవరణంలో సజావుగా సాగేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

ఎస్పీ జానకి మాట్లాడుతూ ప్రపంచ సుందరీమణుల పర్యటనకు వెయ్యి మంది పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదనపు ఎస్పీ రాములు, డీఎఫ్‌వో సత్యనారాయణ, మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, ఆర్‌డీవో నవీన్, డీఈవో ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

కొత్తకోటలో 39.8 డిగ్రీల ఉష్ణోగ్రత

వనపర్తి/నారాయణపేట, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఎండ తీవ్రత స్వల్పంగా తగ్గింది. గురువారం వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో అత్యధికంగా 39.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అత్యల్పంగా వనపర్తిలో 23.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జోగుళాంబ గద్వాల జిల్లాలో 39.7, 22.5, మహబూబ్‌నగర్ జిల్లాలో గరిష్ఠం 38 డిగ్రీలు, కనిష్ఠం 26.5 డిగ్రీలు నమోదైంది. నాగర్ కర్నూల్ జిల్లాలో గరిష్ఠం 35 డిగ్రీలు, కనిష్ఠం 26 డిగ్రీలు, నారాయణపేట జిల్లాలో గరిష్ఠం 35 డిగ్రీలు, కనిష్ఠం 24 డిగ్రీలు నమోదైంది.

ధాన్యం కొనుగోలు చేయాలని

రైతుల రాస్తారోకో



బాదేపల్లి పత్తి మార్కెట్ ఎదుట రహదారిపై రాస్తారోకో చేపట్టిన రైతులు

జడ్చర్ల, మే 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు తెచ్చిన ధాన్యంను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు రాస్తారోకో చేసిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో చోటుచేసుకుంది. బాదేపల్లి పత్తి మార్కెట్‌లోని రైతు ధాన్యం కొనుగోలు కేంద్రానికి జడ్చర్ల మండలంలోని గంగాపురం, ఆల్వాన్‌పల్లి, నెక్కొండ, పోలేపల్లి, పోలేపల్లితండా తదితర ప్రాంతాల నుంచి రైతులు ధాన్యంను విక్రయించేందుకు తీసకువచ్చారు. కాగా తేమ శాతం అధికంగా ఉందంటూ కొనుగోలు చేయకపోవడం, ప్రభుత్వ నిబంధనల మేరకు తేమ శాతం ఉన్న వాటిని కొనుగోలు చేయకపోవడం, తూకం వేసిన బస్తాలను లిఫ్టింగ్ చేయకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పత్తి మార్కెట్ సమీపంలోని 167వ జాతీయ రహదారిపై దాదాపు అరగంట పాటు రాస్తారోకో చేపట్టారు. సంఘ టన స్థలానికి జడ్చర్ల ఎస్ఐ జయప్రసాద్ చేరుకుని రైతులను సముదాయించారు. ఈ సందర్భంగా ఉన్నత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.

బాదేపల్లి పత్తి మార్కెట్‌లోని వరి కొనుగోలు కేంద్రానికి రైతులు తెచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైస్‌మిల్లుల వద్ద బస్తాకు 2కిలోల కోత విధిస్తున్న తీరుపై సైతం చర్యలు తీసుకోవాలంటూ అధికారులను కోరా రు. రైతులు రాస్తారోకో చేపట్టిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆల్వాల్‌రెడ్డి పత్తి మార్కెట్‌కు చేరుకుని రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. సాయంత్రంలోగా ధాన్యంను కొనుగోలు చేయడంతో పాటు ఇదివరకే తూకం వేసిన బస్తాలను రైస్‌మిల్లులకు తరలించేందుకు చర్యలు చేపడ్తామన్న అధికారుల హామీ మేరకు రైతులు శాంతించారు.

దేశంలోనే మొదటిసారి

» ఇందిర సౌర గిరి జల వికాస పథకం గిరిజనులకు ఉపయోగకరం

» ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

అచ్చంపేట/అమ్రాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): దేశంలో మొదటిసారి ప్రారంభించే ఇందిర సౌర గిరి జలవికాస పథకం గిరిజనులకు ఎంతో ఉపయోగకరమని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ నెల 18న ముఖ్యమంత్రి నల్లమల పర్యటనకు వస్తున్నందున అమ్రాబాద్ మండల పరిధిలోని మాచారంలో ఏర్పాటు చేసిన సభను నాగర్ కర్నూల్ ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు కశిరెడ్డి నారాయణ రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, కలెక్టర్ బదావత్ సంతోష్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమం కోసం ప్రారంభించనున్న ఇందిర సౌర గిరి జలవికాస పథకానికి సంబంధించి సభా వేదిక తదితర పనులను అధికారులు ఎంతో బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తున్నారు. 6లక్షల ఎకరాల గిరిజనులకు సంబంధించిన భూములు ఈ పథకానికి ఎంపిక కావడం వల్ల 2.10లక్షల మంది గిరిజన రైతులు లబ్ధిపొందుతారన్నారు. సభకు పెద్ద ఎత్తున అభిమానులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అదనపు కలెక్టర్ దేవసహాయం, జిల్లా అటవీ అధికారి రోహిత్ గోపిడి, డీటీడీవో అధికారి ఫిరంగి, పంచాయతీ అధికారి రాంమోహన్, డీఆర్‌డీవో పీడీ చిన్న ఓబులేసు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, అచ్చంపేట ఆర్డీవో మాధవి, నాయకులుపాల్గొన్నారు.



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లురవి

సామాజిక న్యాయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది

గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి అన్నారు. మాచరం గ్రామంలో ఈ నెల 18న సీఎం రేవంత్ రెడ్డి పర్యటన ఏర్పాట్లను డీసీసీ అధ్యక్షుడు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డితో కలిసి పర్యవేక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎన్నో వినూత్న పథకాలు ప్రవేశ పెట్టిన స్వర్గీయ ఇందిరగాంధీ పరిపాలనను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్న ఇందిరా సౌర జలగిరి వికాస పథకం ఆదివాసి గిరిజనులకు వరం లాంటిదన్నారు. ఈ పథకం ద్వారా పోడు భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు సాగునీటి సమస్య తీరుతుందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు సీఎంపై చేస్తున్న ఆరోపణలు వారి కుటిల నితిని బయటపెడ్తుందన్నారు. వారికి ప్రజలు సరైన సమయంలో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ నల్లమల ప్రాంతంలో సీఎం ప్రారంభించే సౌర జల గిరి వికాస పథకం దేశానికే రోల్‌మోడల్‌గా నిలుస్తుందన్నారు. నల్లమల ప్రాంతంలో పర్యాటక అభివృద్ధితో పాటు అచ్చంపేట నియోజకవర్గంలోని అన్ని మండలాలకు సాగునీరు అందించాలని ఎంపీ మల్లురవితో కలిసి సీఎంకు విన్నవించనున్నట్లు తెలిపారు. సాగునీటి పనులు కూడా త్వరలోనే ప్రారంభమవుతాయని అన్నారు. సీఎం పర్యటనను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా సాగుతుందన్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, అచ్చంపేట మునిసిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ బాలజీ సింగ్, ప్రముఖ కాంట్రాక్టర్ జలందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాచారంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మల్లు రవి

స్వామినారాయణ గురుకుల

విజయోత్సవం



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న స్వామీజీలు

జడ్చర్ల, మే 15 (ఆంధ్రజ్యోతి) : సీబీఎస్ఈ పదవ తరగతి ఫలితాలలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో స్వామి నారాయణ గురుకుల పాఠశాల యాజమాన్యం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. జడ్చర్ల మునిసిపాలిటీ నాగసాల సమీపంలోని స్వామినారాయణ గురుకుల పాఠశాల నుంచి విజయోత్సవ ర్యాలీని జడ్చర్ల, మహబూబ్‌నగర్, భూత్పూర్ మీదుగా గురువారం విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. పదవ తరగతిలో 500 మార్కులకు 494 మార్కులతో రాష్ట్ర 5వ ర్యాంకు, జిల్లా మొదటి ర్యాంకు సాధించిన సందర్భంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలో 91శాతంకు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు సర్వదర్శన్ దాస్‌జీ స్వామీజీ, దర్శన్‌ప్రియదాస్‌జీ స్వామీజీ, ప్రిన్సిపాల్‌లు అభినందించారు.

ఏకలవ్య గ్రూపులో ప్రవేశానికి

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/గద్వాల టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ గిరిజన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబం ధించి ప్రథమ ఇంటర్‌లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలుర నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గురుకులాల ఉమ్మడి జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి కె.సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పూర్తి చేసిన గిరిజన విద్యార్థులు ఇంటర్ ప్రథమ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మెరిట్ ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు. ఎంపీసీలో 14, బైపీసీలో 48, సీఈసీలో 33 మొత్తం 95 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు టీజీఈఎంఆర్ఎస్ బాలానగర్, కల్వకుర్తి ప్రిన్సిపాళ్ల నుంచి దరఖాస్తు ఫారం పొందవచ్చన్నారు. పూర్తిచేసిన దరఖాస్తును ఈనెల 24వ తేదీ సాయంత్రం నాలుగు గంటలలోగా సంబంధిత ప్రిన్సిపాళ్లకు అందజేయాలన్నారు. ఈనెల 26వ తేదీ ఉదయం 10గంటలకు బాలానగర్ టీజీఈఎంఆర్ఎస్ వద్ద కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ఎంపికైన వారికి ఉచిత వసతి భోజనం, నోట్‌పుస్తకాలు, బెడ్స్, దుస్తులు ఉచితంగా అందిస్తారన్నారు. ప్రస్తుతం బాలానగర్, కల్వకుర్తిలలో మాత్రమే గిరిజన ఏకలయ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అయ్యో.. అన్నదాతా..

» అకాల వర్షానికి తడిసిన ధాన్యం

» చేతికొచ్చిన పంట నీటిపాలు

» విపత్కర పరిస్థితిలో రైతులకంట కన్నీరు

పెబ్బేరు/పెబ్బేరురూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): అయ్యో అన్నదాతా.. ఏమిటీ విపత్కర పరిస్థితి.. ఓపక్క అకాల వర్షం.. మరోపక్క మిల్లుల వద్ద ధాన్యం కొనుగోలు కాక అన్నదాత కంట కన్నీరే మిగిలింది. చేతికందిన పంట కళ్లముందే పాడైపోతుంటే చూస్తూ ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో తల్లడిల్లిపోతున్నాడు. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షంతో వేలాది క్వింటాళ్ల ధాన్యం తడిసిపో యింది. గుమ్మడం, తిప్పాయిపల్లి, అయ్యవారిపల్లి, పాతపల్లి, సూగూరు, బున్యాదిపురం గ్రామాల్లో అకాల వర్షానికి ధాన్యం కుప్పలు తడిసిపోయినాయి. ధాన్యం రాశుల కిందకు వర్షం నీళ్లు రావడంతో తూకాలు నిలిపివేశారు. బున్యాదిపురంలో తూకాలు చేసిన ధాన్యం బస్తాలు కొనుగోలు కేంద్రంలోనే ఉంచడంతో దాదాపుగా వంద బస్తాలకు పైగా వర్షానికి తడిసిపోయింది. తడిసిన ధాన్యాన్ని రైతులు పక్కకు ఆరబోస్తున్నారు. శ్రీరంగాపురం మండలం శేరుపల్లిలో టార్పాన్ కవర్లు లేకపోవడంతో ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. పెబ్బేరు పట్టణంలోనే సత్యసాయి రైస్‌మిల్లు ధాన్యం లారీలు అన్‌లోడ్ చేసేందుకు వచ్చి రహదారి వెంట భారీగా నిలిచిపోయాయి. రెండు రోజుల నుంచి రైస్ మిల్లు దగ్గర లారీలు వచ్చిన అన్‌లోడ్ చేయడం లేదని లారీ డ్రైవ ర్లు తెలియజేస్తున్నారు.

తడిసిన ధాన్యం మళ్లీ ఆరబెట్టేందుకు రైతులు కష్టాలు పడుతున్నారు. పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ ఆవరణంలో దాదాపుగా 15వేల బస్తాల ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.



ఆరబెట్టిన ధాన్యంలోకి వచ్చిన వర్షపు నీటిని తోడేస్తున్న రైతులు



పెబ్బేరు ఓ రైస్‌మిల్లు దగ్గర భారీగా నిలిచి ఉన్న ధాన్యం లారీలు



బున్యాదిపురంలో వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతు

నిండా ముంచుతుండ్రు..

● 40 కిలోల బస్తాకు రూ.25.70 ఖర్చు

» తూకం వద్ద అదనంగా కిలో, రైస్‌మిల్లర్ కొండిపెడితే అదనంగా 2కిలోలు కోత

» ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద పడిగాపులు పడుతున్నరైతులు

జడ్చర్ల, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టపడి పండించిన వరిపంటను విక్రయానికి తీసుకెళ్లిన రైతు నిండా మునుగుతున్నాడు. ప్రైవేట్ సెంటర్‌లో విక్రయానికి వెళ్లిన రైతును మోసం చేసిన దాఖలాలు ఉండగా, నేడు ప్రభుత్వమే ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సైతం మోసానికి గురవుతున్నాడు. 40కిలోల బస్తాకు ఏకంగా రూ.25.70 భారాన్ని మోపుతున్నారు. తూకం వేసే సందర్భంలో ప్రతీ 40కిలోల బస్తాకు అదనంగా ఒక కిలో ధాన్యం నష్టపోతున్నాడు. వీటితో పాటు రైస్‌మిల్లు వద్ద మిల్లరు తరుగు పేరుతో అదనంగా మరో రెండు నుంచి మూడు కిలోల ధాన్యం కోత పెడుతున్నాడు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నా అరికట్టేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురికావడంతో పాటు నష్టపోతున్నాడు.

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద 40 కిలోల బస్తాకు ఏకంగా రూ.25.70 ఖర్చును రైతు భరిస్తున్నారు. ఇందులో హమాలీలకు రూ.11.05, చాటకూలీలకు రూ.3.50, దడవయి రూ.5.15తో పాటు తూకం వేసిన బస్తాలను మిల్లుకు పంపించేందుకు లారీలో లోడింగ్‌కు రూ.6ను రైతు వెచ్చిస్తున్నాడు. క్వింటాలు ధాన్యంకు ఏకంగా రూ.64.25 భారం రైతు నెత్తిన నెడుతున్నారు. ట్రాక్టర్‌లో రైతు తీసుకువచ్చిన ధాన్యంను రైతు స్వయంగా కుప్ప పోసుకున్న వాటికి సైతం హమాలీ చెల్లిస్తున్నాడు. ఏదైన వాహనంలో రైతు తెచ్చిన ధాన్యాన్ని అన్‌లోడ్ చేయడంతో పాటు కుప్పగా పోసేందుకు 40కిలోల బస్తాకు రూ.6.76, తూకం వేసేందుకు, తూకం వేసిన బస్తాకు కుట్టేందుకు బస్తాకు రూ.4.25లను హమాలీలకు చెల్లించాలంటూ 2024 అక్టోబరు 30న అదనపు కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల ఆధారంగా రైతుల వద్ద వసూలు చేస్తున్నారు. ఇదే ఉత్తర్వులో చాటకూలీలకు బస్తాకు రూ.1.80 చెల్లించాలని ఉండగా, అందుకు భిన్నంగా రూ.3.50 వసూలు చేస్తున్నారు. తూకం వేసిన బస్తాలను రైస్‌మిల్లులకు తరలించేందుకు లారీలలో లోడింగ్ చేసే హమాలీ సైతం రైతు నుంచే వసూలు చేస్తుండటం గమనార్హం.

ప్రతి 40కిలోల బస్తాకు అదనంగా కిలో ధాన్యంను తూకం వేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నెట్ వెయిట్ 40కిలోలు ఉండాలి. అయితే గోనెబస్తాకు సమానంగా 600 గ్రాములతో పాటు తరుగు పేరుతో మరో కిలోతో మొత్తం 41కిలో600 ధాన్యంను తూకం వేస్తున్నారు. దీంతో ప్రతీ బస్తాకు ఒక కిలో చొప్పున రైతు నష్టపోతున్నాడు. కస్టమ్ మిల్లింగ్ కోసం ధాన్యంను రైస్‌మిల్లర్‌కు తరలించగా, యాసంగి పంట కటింగ్ అవుతుందని మెలికపెట్టి ప్రతీ 40బస్తాలకు సుమారు 2 కిలోల ధాన్యాన్ని కోత కోస్తున్నారు. క్వింటాలు ధాన్యంకు దాదాపు 6కిలోల వడ్లను రైతు నష్టపోతున్నాడు. ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర క్వింటాలుకు రూ.2320 ప్రకారం రైతు సుమారు రూ.150 నష్టపోతున్నాడు. విక్రయానికి తీసుకువచ్చిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు, తాలు తీసేందుకు రైతు అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ధాన్యంను ఆరబెట్టేందుకు కూలీలకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున చెల్లిస్తున్నాడు. అలాగే తాలు లేకుండా ఉండేలా తూర్పారపట్టేందుకు సైతం ఒక్కో కూలీకి రూ.500 చెల్లిస్తూ అదనపు ఖర్చును భరిస్తున్నాడు. ప్రభుత్వం నిర్దేశించిన తేమ శాతం ఉండేలా ధాన్యంను ఆరబెట్టడం, వర్షం పడితే కుప్పగా పోసుకోవడంతో పది రోజుల నుంచి పదిహేను రోజుల పాటు వరి కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితిలో రైతు ఉన్నాడు.



తూర్పార పడుతున్న రైతు



వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఎత్తుకుంటున్న రైతులు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

» భర్త, కుమారుడికి గాయాలు



తిమ్మమ్మ (ఫైల్)

ఎర్రవల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఎర్రవల్లి మండల పరిధిలోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. ఇటిక్యాల ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. అయిజ మండలం గుడిదొడ్డి గ్రామానికి చెందిన హుసేన్‌రెడ్డి, భార్య తిమ్మమ్మ అలియాస్ సరిత (30), కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డిలు గురువారం ఉదయం ద్విచక్ర వాహనంపై వనపర్తి జిల్లా, గంగవరం గ్రామానికి వెళ్తున్నారు. వారు వెళ్తున్న బైక్‌ను జింకలపల్లి స్టేజీ వద్ద వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. దీంతో తిమ్మమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. భర్త హుసేన్ రెడ్డి, కుమారుడు జగన్‌మోహన్ రెడ్డిలు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. మృతురాలి అన్న దేవేందర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఈతకు వెళ్లి వ్యక్తి..

ఎర్రవల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి) : బావిలో ఈతకు వెళ్లి ఓ వ్యక్తి నీటిలో మునిగి మృతి చెందాడు. ఎస్ఐ మురళి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా రేవల్లి మండలం కొంకలపల్లి గ్రామానికి చెందిన శేషయ్య (56) బుధవారం కోదండాపురం గ్రామంలో జరిగిన దేవర ఉత్సవానికి వచ్చాడు. రాముడు, నాగేంద్ర అనే వ్యక్తులతో కలిసి వేముల శివారులో వ్యవసాయ బావిలో ఈతకు వెళ్లారు. ప్రమాదవశాత్తు శేషయ్య కాలు పూడికలో చిక్కుకుపోయి బయటకు రాలేక నీటిలో మునిగిపోయాడు. గమనించిన రాముడు, రాగేంద్ర బావిలో గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో గ్రామస్థులు, పోలీసులకు సమాచారం అందించారు. గురువారం ఉదయం శేషయ్య మృతదేహం బావిలో తేలింది. అతడి కుమారుడు రాంభూపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గడ్డివాము దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

గద్వాల క్రైం, మే 15 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ మండల పరిధిలోని ఉప్పల్‌క్యాంపులో బుధవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. అగ్నిమాపక శాఖ అధికారి రాకేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రైతు బడేసాబ్‌కు చెందిన గడ్డివామికి బుధవారం అర్ధరాత్రి మంటలు అంటుకున్నాయి. గమనించిన గ్రామస్థులు మంటలను ఆర్పేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని మంటలను ఆర్పేశారు. దాదాపు రూ. 80 వేల నష్టం జరిగినట్లు రాకేశ్ తెలిపారు. కార్యక్రమంలో ఏఎల్ఎఫ్ లక్ష్మణ్‌నాయుడు, డీఓపీ రవిప్రకాశ్, ఫైర్‌మెన్‌లు చంద్రశేఖర్, మహేందర్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా

» రెండు టిప్పర్లు, ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్ పట్టివేత

కృష్ణ/ రాజాపూర్, మే 15 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు చోట్ల ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లు, ఒక టాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. కృష్ణ ఎస్ఐ నవీద్, రాజాపూర్ ఎస్ఐ శివానందం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా, కృష్ణ మండల పరిధిలోని ముడుమాల్ శివారులో ఉన్న కృష్ణానది నుంచి బుధవారం తెల్లవారుజామున కర్ణాటక వైపు ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లను తహసీల్దార్ వెంకటేశ్ పట్టుకున్నారు. టిప్పర్లు రమేశ్ రాథోడ్, రఘుపతిలకు చెందినవిగా గుర్తించి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. టిప్పర్ డ్రైవర్లు మల్లప్ప, బుగ్గప్పలపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

- మహబూబ్‌నగర్ జిల్లా, రాజాపూర్ మండల కేంద్ర సమీపంలోని దుందుభీ వాగు నుంచి గురువారం అనుమతి లేకుండా ఇసుకను ట్రాక్టర్‌లో లోడ్ చేస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ శివానందం తెలిపారు. ట్రాక్టర్‌తో పాటు, ఎక్స్‌కవేటర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్లు శ్రీశైలం, శేఖర్‌లపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వడ్డేపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి) : పొలంలో గడ్డి మందు పిచికారి చేస్తుండగా అస్వస్థతకు గురైన రైతు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. జోగుళాంబ గద్వాల జిల్లా, వడ్డేపల్లి మండల పరిధిలోని లింగన్నవాయి గ్రామానికి చెందిన రైతు రాజశేఖర్ (33) వారం క్రితం పొలంలో గడ్డి మందు పిచికారీ చేస్తూ అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు అతడిని హుటాహుటిన కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. సంఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డెంగీ డేంజర్ బెల్స్

మహబూబ్‌నగర్ పట్టణంలోనే అత్యధికంగా కేసులు

» జిల్లాలో 5 నెలల్లో 35 పాజిటివ్ కేసులు » ప్లేట్‌లెట్స్ తగ్గితే ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు » సొమ్ము చేసుకుంటున్న ప్రైవేటు ఆసుపత్రులు

» జనరల్ ఆసుపత్రిలో మూలన పడ్డ ఎస్‌డీపీ యంత్రం - నేడు జాతీయ డెంగీ నివారణ దినోత్సవం





పద్మావతీ కాలనీలోని ఓ ఇంటి వద్ద శుభ్రం చేయని మురుగునీటి కాలువ

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) మే 15 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలో డెంగీ వ్యాధి దడ పుట్టిస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 35 కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. వాతావరణం, కాలంతో పనిలేకుండా దోమల వలన ఈ వ్యాధి వ్యాపిస్తోంది. గ్రామీణ ప్రాంతాలలో కాకుండా, మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ వ్యాధి ఎక్కువ మందికి సోకుతోంది. వ్యాధి సోకి తెల్లరక్తకణాలు తగ్గిపోయి ప్లేట్‌లెట్స్ ఎక్కించాలంటే ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోంది. జనరల్ ఆసుపత్రిలో ఆ సౌకర్యం ఉన్నప్పటికీ ఎస్‌డీపీ యంత్రం పనిచేయడం లేదు. దీంతో ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు సొమ్ము చేసుకుంటున్నాయి. శుక్రవారం జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

పట్టణ ప్రాంతాల్లోనే అధికం

జిల్లాలో డెంగీ వ్యాధి ప్రమాదకరంగా వ్యాపిస్తోంది. ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లోనే పాజిటివ్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 35 డెంగీ కేసులు నమోదయ్యాయి. అందులో 21 కేసులు పాలమూరు పట్టణ ప్రాంతంలో నమోదుకాగా, 14 కేసులను మండలాల్లో గుర్తించారు. గ్రామాల్లో అక్కడక్కడ మాత్రమే కేసులు వస్తున్నాయి. కానీ జిల్లాకేంద్రంలోని మురికివాడల్లో ఈ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. అందులో రామయ్యబౌలి, శ్రీనివాసకాలనీ, పద్మావతి కాలనీ, దొడ్డలోనిపల్లి, టీడీ గుట్ట, క్రిస్టియన్‌పల్లి, మర్లు, మోతీనగర్, కుమ్మరివాడి, పాత పాలమూరు, ఎదిర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి.

గత ఏడాదితో పోలిస్తే...

గత ఏడాది జనవరి నుంచి డిసెంబర్ 31 వరకు జిల్లావ్యాప్తంగా 481 డెంగీ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 5 నెలల్లో 35 కేసులు నమోదు కాగా, గత ఏడాది తొలి ఐదు నెలల్లో 48 కేసులు నమోదయ్యాయి. ఈ లెక్కన గత ఏడాదితో పోలిస్తే కొంత వరకు కేసులు తగ్గాయి. అయితే జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వర్షాలు కురిసే కాలం కాబట్టి, కేసుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

ప్లేట్‌లెట్స్ పేర దోపిడీ

డెంగ్యూ వ్యాధి సోకినపుడు మనిషిలో తెల్ల రక్తకణాలు (ప్లేట్‌లెట్స్) తగ్గుతాయి. సాధారణంగా 1.5 లక్షల నుంచి 3.5 లక్షల వరకు ఉంటే నార్మల్‌గా పరిగణిస్తారు. అంతకంటే తగ్గితే తెల్ల రక్తకణాలను ఎక్కించాల్సి ఉంటుంది. అయితే ఈ ప్లేట్‌లెట్స్ ఎక్కించాలంటే ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. ఇదే అదనుగా ప్రైవేటు డయాగ్నోస్టిక్ సెంటర్లు, ఆసుపత్రుల యాజమాన్యాలు ప్రజలను దోపిడీ చేస్తున్నాయి. ప్లేట్‌లెట్స్ నార్మల్‌గా ఉన్నప్పటికీ, తగ్గినట్లు రిపోర్టులు సృష్టిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఒక్కో ప్లేట్‌లెట్ యూనిట్ ధర రూ. 14 వేల నుంచి రూ. 16 వేల వరకు ఉంది. ఎక్కించడానికి అదనంగా యూనిట్‌కు రూ. 20వేల వరకు వసూలు చేస్తున్నారు.

ఎస్‌డీపీ ఉన్నా నిరుపయోగం

మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రిలో ప్లేట్‌లెట్లు ఎక్కించే ఎస్‌డీపీ (సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్) యంత్రాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. రూ. 1 కోటి వ్యయంతో దీన్ని ఏర్పాటు చేసినా, కిట్లు లేక పోవడంతో ఆ యంత్రం మూలన పడింది. గత కొన్నేళ్లుగా ప్రభుత్వం ఈ యంత్రానికి సంబంధించిన కిట్లను సరఫరా చేయడం లేదు. వాస్తవానికి ఒక్కో కిట్టు ధర రూ. 6 వేల నుంచి రూ. 7 వేల వరకు ఉంటుంది. అంత పెద్ద మొత్తంలో కిట్లను ఇవ్వడానికి ప్రభుత్వం ముందుకు రావడం లేదు. దీంతో ఆ యంత్రం ఉన్నా నిరుపయోగంగా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎస్‌డీపీ కిట్లు మంజూరు చేస్తే ప్రజలకు మేలు జరిగే అవకాశం ఉంది.

'పేట' జిల్లాలో గత ఏడాది 48 కేసులు

నారాయణపేట (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లాలో గత ఏడాది 48 కేసులు డెంగీ కేసులు నమోదయ్యాయి. ఇద్దరు మృతి చెందారు. జిల్లాలో ప్రతీ సంవత్సరం కేసుల సంఖ్య పెరుగుతోంది. 2022లో 37, 2023లో 38 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఇప్పటివరకు మూడు డెంగీ పాజిటివ్ కేసులు నమోదైనట్లు వైద్యాధికారులు తెలిపారు. వారు ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకున్నట్లు చెప్పారు.

ఎడ్యుకేషనల్ హబ్‌గా పాలమూరు

» ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు ఉచిత శిక్షణ

» ఎప్‌సెట్‌లో 114 మందికి మెరుగైన ర్యాంకులు

» మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

» విద్య మాత్రమే శాశ్వతం : కలెక్టర్ విజయేందిర బోయి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం మే 15 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్, లా, ఐఐటీ తదితర విద్యా సంస్థలను ఏర్పాటు చేసి, పాలమూరును ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ బాలికలు, బాలుర జూనియర్ కళాశాలల్లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు ఎప్‌సెట్ కోసం మహబూబ్‌నగర్ ఫస్ట్ నవరత్నాలు కార్యక్రమంలో భాగంగా 'పయనీర్' పేరుతో ఉచితంగా శిక్షణ ఇచ్చారు. వారిలో 114 మంది విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించారు. వారిని గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను కన్న కలలను విద్యార్థులు నిజం చేశారన్నారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన రోజు కంటే ఈ రోజు ఎంతో సంతోషంగా ఉన్నానన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించడం గర్వంగా ఉందని తెలిపారు. వారికి మరింత ప్రోత్సాహం అందిస్తే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారన్నారు. కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ విద్య ఒక్కటే శాశ్వతమని తెలిసిన వ్యక్తి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పాలమూరు యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ జీఎన్ శ్రీనివాసులు మాట్లాడుతూ పాలమూరులో విద్యారంగ అభివృద్ధికి ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. అనంతరం మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, డీఐఈవో కౌసర్‌జహాన్, ప్రిన్సిపాల్ భగవంతాచారి మాట్లాడారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనితారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, టీపీసీసీ అధికార ప్రతినిధి, టీపీఆర్‌టీయు వ్యవస్థాపకుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, జేపీఎన్‌సీఈ చైర్మన్ కేఎస్ రవి కుమార్, రిషి కళాశాల అకాడమిక్ డైరెక్టర్ వెంకటయ్య, ప్రతిభ కళాశాల డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, సీఎంవో బైకాని బాలుయాదవ్, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేటి నుంచి జాండ్ర ప్రీమియర్ లీగ్

» ఈ నెల 18 వరకు కొనసాగనున్న పోటీలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 15(ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ పట్టణ జాండ్ర యువజన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 18 వరకు జాండ్ర ప్రీమియర్ లీగ్ క్రికెట్(జెపిఎల్) టోర్నీ నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. పట్టణంలోని బాలుర కళాశాల మైదానంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జాండ్ర ప్రీమియర్ లీగ్ టోర్నీలో 21 జట్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. ప్రారంభోత్సవానికి మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర జాండ్ర సంఘం అధ్యక్షుడు బుగిడి అనూప్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు. అలాగే ఓపెన్ స్థాయి చెస్ పోటీలను కుర్హిని శెట్టికాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం జేపీఎల్-3కి సంబంధించిన టీ షర్టులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పవన్‌కుమార్, మల్లేశ్, కోశాధికారి అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు సాయికుమార్, విశ్వకాంత్, అనిల్‌కుమార్, చంద్రశేఖర్, అవినాశ్, శ్రీశైలం, శివకుమార్ పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

» పరారీలో మరొకరు » 350 గ్రాములు స్వాధీనం



గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

మహబూబ్‌నగర్, మే 15 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 350 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసు కున్నారు. మరొకరు పరారీలో ఉన్నారు. సంఘటనకు సంబంధించి ఎక్సైజ్ సీఐ వీరా రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎక్సైజ్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం ఆదేశం మేరకు జిల్లా అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించా రు. మహబూబ్‌నగర్ పట్టణంలోని బోయపల్లి గేట్ సమీపంలో ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు వారికి పక్కా సమాచారం అందింది. దీంతో గురువారం ఆ ప్రాంతంలో నిఘా ఏర్పాటు చేశారు. షాషాబ్ గుట్టకు చెందిన ఎండీ సల్మాన్, కోడి నరేశ్, పాషా అనే వ్యక్తులు ద్విచక్రవాహనంపై తిరుగుతూ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 60 గ్రాముల గంజాయి లభించింది. కొత్తగం జికి చెందిన దమ్మాయిపల్లి కిశోర్‌కుమార్ అనే వ్యక్తికి గంజాయి అమ్మేందుకు అక్కడికి వచ్చి నట్లు వారు అంగీకరించారు. గంజాయిని హన్వాడ మండలం వేపూర్ తండాకు చెందిన కాడావత్ రాహుల్ నుంచి తెచ్చినట్లు తెలి పారు. దీంతో ప్రత్యేక బృందం అక్కడికి వెళ్ళి రాహుల్‌ను అదుపులోకి తీసుకున్నది. అతని వద్ద 290 గ్రాముల గంజాయి లభించింది. నలుగురినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిం చారు. దమ్మాయిపల్లి కిశోర్ పరారీలో ఉన్నా డు. నిందితుల నుంచి ఓ ద్విచక్ర వాహనం, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

అదుపు తప్పి కారు బోల్తా

» ఐదుగురికి స్వల్ప గాయాలు

చారకొండ, మే 15 (ఆంధ్రజ్యోతి) : కారు అదుపు తప్పి బోల్తా పడటంతో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండలంలోని మర్రిపల్లి వద్ద గురువారం ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... వనపర్తి జిల్లా చిట్యాలకు చెందిన సురేశ్ కుటుంబ సభ్యులతో కలిసి కారులో విశాఖపట్టణం వెళ్లి తిరిగి వస్తున్నాడు. మండలంలోని మర్రిపల్లి వద్ద నూతనంగా నిర్మిస్తున్న బైపాస్ రోడ్డుపై పోసిన మట్టికుప్పను ఢీ కొని కారు బోల్తా పడింది. బెలూన్స్ ఓపెన్ కావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు వారిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్ఐ శంషొద్దీన్ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ, ఇద్దరికి గాయాలు

మిడ్జిల్, మే 15 : (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలంలోని వాడియాల స్టేజీ వద్ద రెండు బైకులు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. జడ్చర్ల మండలం మాచారం గ్రామానికి చెందిన శ్రీశైలం, సురేశ్‌లు ద్విచక్ర వాహనంపై శ్రీశైలానికి వెళ్తున్నారు. అలాగే చౌటకుంట తండా గ్రామ పంచాయతీ పరిధిలోని పలుగు తండాకు చెందిన పాండు మిడ్జిల్ నుంచి వస్తున్నాడు. వాడియాల స్టేజీ వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నాయి. దీంతో సురేశ్, పాండులు గాయపడ్డారు. వారిని టోల్‌గేట్ అంబులెన్స్‌లో జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

డబ్బు చెల్లింపుల్లో జాప్యం

» ఆన్‌లైన్ నమోదులో ఆలస్యం » ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతాంగం » ఐకేపీ అధికారుల పనితీరుపై ఆగ్రహం

» 47,937 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు » ట్యాబ్ ఎంట్రీ చేసింది 23,379 మెట్రిక్ టన్నులు



ఆన్‌లైన్ ఎంట్రీ చేస్తున్న బుక్‌కీపర్లు (ఫైల్)

గద్వాల, మే 15 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలో ధాన్యం సేకరణ జోరుగా సాగుతోంది. కలెక్టర్ బీఎం సంతోష్‌తో పాటు ఆదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, సివిల్ సప్లయ్ మేనేజర్ విమలలు కొనుగోలు కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి ధాన్యం సేకరణను వేగవంతం చేశారు. కానీ ధాన్యం విక్రయించిన రైతులకు డబ్బుల చెల్లింపులో జాప్యం జరుగుతోంది. ఆన్‌లైన్లో ట్యాబ్ ఎంట్రీ ఆలస్యం అవుతుండటమే అందుకు కారణమని తెలుస్తోంది. బుధవారం వరకు 47,937 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు సేకరించగా, ఐకేపీ అధికారులు ఇప్పటి వరకు 23,379 మెట్రిక్ టన్నుల మేర ట్యాబ్ ఎంట్రీ చేశారు. అంటే దాదాపు 50 శాతం ధాన్యం కొనుగోలు ఆన్‌లైన్లో నమోదు చేయకపోవడంతో రైతుల ఖాతాల్లో డబ్బు జమకాలేదని తెలిపోయింది. ట్యాబ్ ఎంట్రీలను వేగవంతం చేయడంలో ఐకేపీ అధికారులు, మండల ఏపీఎంలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తునారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రైతులకు రూ.50.88 కోట్లు

జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో బుధవారం వరకు 6,989 మంది రైతుల నుంచి 47,937 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు సేకరించారు. ఇందుకుగాను రైతులకు రూ.111.21 కోట్లు చెల్లించాల్సి ఉంది. కానీ ఆన్‌లైన్ ట్యాబ్ ఎంట్రీలు మాత్రం 23,379 మెట్రిక్ టన్నులకు, అంటే రూ.54.24 కోట్లకు మాత్రమే చేశారు. అందులో ప్రభుత్వం 21,935 మెట్రిక్ టన్నుల ధాన్యానికి రూ.50.88 కోట్లను చెల్లించింది. ఆన్‌లైన్ ట్యాబ్ ఎంట్రీ చేసిన వెంటనే ప్రభుత్వం రైతుల ఖాతాలలో డబ్బు జమ చేస్తోంది. కానీ ట్యాబ్ ఎంట్రీలో జాప్యం జరుగుతుండటంతో రైతుల ఖాతాల్లో డబ్బు జమకావడం లేదు. ఈ ప్రక్రియను పర్యవేక్షించాల్సిన ఐకేపీ అధికారులు పట్టనట్లు ఉండటం, బుక్‌కీపర్, సెంటర్ ఇన్‌చార్జీల మీద వదిలి వేయడం వల్లే ఆలస్యం అవుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ట్రక్ షీట్‌లపై నెడుతున్న ఐకేపీ

ట్యాబ్ ద్వారా ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలంటే ముందు బుక్ కీపర్, లేదా సెంటర్ ఇన్‌చార్జీలు కొనుగోళ్లు చేసిన ధాన్యం వివరాలను ట్రక్ షీట్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. వాటిని లారీ డ్రైవర్ల ద్వారా సంబంధిత మిల్లుకు పంపించాలి. ట్రక్ షీట్‌ను రైస్ మిల్లర్ ఎంట్రీ చేసుకొని సంతకం చేసి తిరిగి అదే సెంటర్‌లోని బుక్‌కీపర్‌కు పంపిస్తాడు. ఆ తర్వాతే ట్యాబ్ ద్వారా ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలి. సేకరించిన ధాన్యం 47,937 మెట్రిక్ టన్నులు కాగా, అందులో 46,917 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు రైస్ మిల్లులకు చేర్చారు. అంటే దాదాపు ట్రక్‌షీట్లు అన్నీ మిల్లుకు వెళ్లి, తిరిగి సెంటర్‌కు చేరాయి. కానీ ట్రక్ షీట్లను అలస్యంగా ఇస్తున్నారంటూ ఐకేపీ సిబ్బంది మిల్లర్లపైకి నెట్టేస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఎంట్రీల ఆలస్యం వల్లే కొనుగోలు చేసిన వారం, పది రోజుల తర్వాత కానీ రైతుల ఖాతాల్లో డబ్బు జమ కావడం లేదు. ఇది తెలియని రైతులు ప్రభుత్వం ఆల స్యంగా డబ్బులు వేస్తుందని ఆరోపిస్తున్నారు. డీఆర్ డీఏ అధికారులు దీనిపై దృష్టి పెట్టి ఆన్‌లైన్లో నమోదు త్వరగా చేయించాలని కోరుతున్నారు.

ట్యాబ్ ఎంట్రీలు త్వరగా చేయాలి



రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి ట్యాబ్ ఎంట్రీలు త్వరగా చేయడం లేదు. దీంతో రైతులు అమ్మిన వారం రోజుల తర్వాత ఖాతాల్లో డబ్బు జమ అవుతుంది. ప్రభుత్వం నుంచి అలస్యం లేకపోయిన ఆన్‌లైన్ నమోదులో జాప్యం జరుగుతుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పర్యవేక్షించి సమస్యను పరిష్కరించాలి.

- గోపాల్, తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

15 రోజులైనా డబ్బు జమ కాలేదు



నేను ఐకేపీ ఐకేపీ కొనుగోలు కేంద్రంలో 15 రోజుల క్రితం 832 సంచుల ధాన్యం విక్రయించాను. లారీల కొరతతో ధాన్యం కేంద్రంలోనే నిలిచింది. ఇప్పుడు మిల్లుకు పోయినా ట్యాబ్ ఎంట్రీ ఆలస్యం అయ్యింది. ఇప్పటికి 15 రోజులు గడిచినా ఖాతాల్లో డబ్బు జమ కాలేదు.

- శ్రీనివాస్‌రెడ్డి, రైతు, లత్తిపురం, గద్వాల మండలం

టాస్క్‌ఫోర్స్ పోలీసులపై దాడి

» ముగ్గురిపై కేసు నమోదు



టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న టిప్పర్

కొత్తపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులపై యజమానితో పాటు, అతడి కొడుకు దాడి చేశారు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా, కొత్తపల్లి మండల కేంద్రం శివారులో జరిగింది. ఎస్ఐ విజయకుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లింగాల్‌చేడ్ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను కొత్తపల్లి శివారులో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆపేందుకు యత్నించారు. కానీ డ్రైవర్ ఎండీ షరీఫ్ టిప్పర్‌ను ఆపకుండా వెళ్లిపోయాడు. కొత్తపల్లి తండా సమీపంలో ఇసుకను ఖాళీ చేస్తుండగా అక్కడికి చేరుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. దీంతో టిప్పర్ యజమాని మహబూబ్‌బాషా, అతడి కుమారుడు ఖదీర్ వారిని దుర్భాషలాడుతూ దాడి చేశారు. దీంతో వారు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. టిప్పర్‌ను మద్దూరు పోలీసుస్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌తో పాటు, తండ్రీ కొడుకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంటర్వ్యూ..

పన్నులు చెల్లించి పంచాయతీల అభివృద్ధికి పాటుపడాలి

- పి.మహేష్ నాయక్, ఇన్‌చార్జి ఎంపీవో



బిజినేపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు బాధ్యతగా గ్రామ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఎలాంటి వ్యాధులు వ్యాప్తి జరగకుండా ఆరోగ్యంగా ఉంటారని బిజినేపల్లి మండల ఇన్‌చార్జి ఎంపీవో మహేశ్‌నాయక్ అన్నారు. గ్రామాభివృద్ధి అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని ఆంధ్రజ్యోతికిచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారా ?

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు భగీ టరథ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు బోరుబావుల పునరుద్ధరించడం, నీటి వృథాను అరికట్టడంతో ఎక్కడా నీటి ఎద్దడి రాకుండా పని చేస్తున్నాం.

ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో చెత్త వాహనాలు నడపడం భారంగా మారిందా?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పంచాయతీలకు రావాల్సిన నిధులు సక్రమంగా రావడం లేదు. సర్పంచుల పదవీ కాలం పూర్తి కావడంతో ఇన్‌చార్జి అధికారులతో పాలన సాగిస్తున్నాం. చెత్త సేకరణ చేపట్టి గ్రామాల పరిశుభ్రతకు పాటుపడుతున్నారు.

వందశాతం పన్నులు వసూలు అవుతున్నాయా?

ఇంటిపన్ను, నీటిపన్ను, వ్యాపార పన్ను వంటి పన్నులు ప్రజల నుంచి సిబ్బంది పారదర్శకంగా వసూలు చేస్తున్నారు. గతంలో కంటే పన్నులు కట్టడంపై ప్రజల్లో అవగాహన పెరిగింది. ట్యాక్సీల వసూలుకు గ్రామ పంచాయతీ సిబ్బందిని ప్రత్యేక బృందంగా ఏర్పాటు చేసి ఇంటింటికి తిరిగి వసూలు చేపట్టి గ్రామాభివృద్ధికి ఖర్చు చేస్తున్నాం.

న్యూస్ బాక్స్

నేడు డయల్ యువర్ డీఎం

కొల్లాపూర్, మే 15 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ డిపో పరిధిలో ప్రజారవాణా సమస్యలపై నియోజకవర్గ ప్రజలతో తగు సూచనలు, సలహాలు తీసుకునేందుకు నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఉమాశంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు నిర్వహించడం తెలిపారు. 9493733602 ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. ఈ అవకాశాన్ని కొల్లాపూర్ డిపో పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

బల్మూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జినుకుంట గ్రామానికి చెందిన ఎల్లికంటి కుర్మయ్య అనే వ్యక్తి వారం రోజుల క్రితం అనారోగ్యానికి గురై మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన మాల మహానాడు సంఘం నాయకులు, మృతుని భార్య సంజమ్మకు రూ.16,500 ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. సహాయం అందించిన వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శివకుమార్‌గౌడ్, మాల మహానాడు సంఘం నాయకులు పి.కృష్ణస్వామి, చంద్రయ్య, బాలచంద్రయ్య, బాలు, ఈశ్వరయ్య, చంద్రమౌళి, శ్రీనివాసులు ఆర్థిక సహాయం అందించిన వారిలో ఉన్నారు.

సిర్సవాడకు ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని వినతి

తాడూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిర్సవాడ గ్రామానికి గతంలో కల్వకుర్తి నుంచి సిర్సవాడ మీదుగా జడ్చర్ల వరకు మూడు బస్సులు ఆరు ట్రిప్పులు తిరుగుతుండేవి. ప్రస్తుతం కొన్ని రోజులుగా బస్సులను ఆర్టీసీ అధికారులు నడపకపోవడం మూలంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో గురువారం సిర్సవాడ గ్రామస్థులు డిపో వద్దకు వెళ్లి డీఎంను కలుద్దామనుకుండగా ఆమె లేకపోవడంతో ఫోన్‌లో సమాచారం అందజేసి వినతి పత్రాన్ని డిపో ట్రాఫిక్ సూపరింటెండెంట్ ఎంఎస్.నాయుడుకు అందజేశారు. వెళ్లినవారిలో మాజీ సర్పంచ్ రాజేందర్‌రెడ్డి, అల్లోజీ, యాదయ్య, మల్లయ్య, పరశురాములు, విజయ్‌కుమార్, లవకుమార్, రమేష్, చిరు, రవికుమార్, శివ,చెన్నకేశవులు ఉన్నారు.

ఉపాధి అవకాశం కల్పించాలి

తిమ్మాజిపేట, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఉమ్మడి పాలమూరు జిల్లాకు మద్యం సరఫరా చేసే మద్యం డిపోలో హమాలీలుగా పని చేయడానికి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కల్పించాలని యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు దానం బాలరాజు కోరారు. ఆయా గ్రామాల నిరుద్యోగ యువకులు, జిల్లా మైనార్టీ నాయకులు ముబారక్‌తో కలిసి మద్యం డిపో మేనేజర్ వాజీద్‌కువినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. అంతకు ముందు వారు డిపో ఎదుట నినాదాలు చేశారు. సందీప్, సెహ్వాగ్, పరశురాం, బాలస్వామి, మోహన్, శ్రీనివాసులు ఉన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించాలి

తిమ్మాజిపేట, మే 15 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయ విస్తరణాధికారి సాయిరాం అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతులనుద్దేశించి ఆయన గురువారం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అన్నారు. భూమి కలిగిన రైతులు భూములకు సంబంధించిన సమాచారంతో ఈఫార్మర్ రిజిస్ట్రీచేసుకోవాలన్నారు. ఏఈవోల పట్టాదారు పాసు పుస్తకం ఆధార్ లింక్ చేయబడిన ఫోన్ నెంబరు గల ఫోన్‌తో సంప్రదించాలన్నారు.

మరీ ఇంత జాప్యమా ?

- కొనుగోలు కేంద్రాల్లో వారం పది రోజులపాటు రైతుల పడిగాపులు
- 40 కేజీల బస్తాకు అదనంగా1.300 గ్రాములు తూకం
- వడ్లను తూకం చేయని కేంద్రాల నిర్వాహకులు



కొరటికల్‌లో వర్షానికి తడిసిన ధాన్యం

ఉప్పునుంతల, మే 15 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల్లో వడ్ల కొనుగోలులో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 27 గ్రామపంచాయతీలలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఉప్పునుంతల, వెల్టూరు, మర్రిపల్లి, లక్ష్మాపూర్, దాసర్లపల్లి, మొల్గర, జప్తిసదగోడు గ్రామాల్లో బుధవారం వరకు 617 మంది వద్ద 34,860 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు పీఏసీఎస్ సీఈవో రవీందర్‌రావుతెలిపారు. అదే విధంగా ఐకేపీ ఆధ్వర్యంలో మామిళ్లపల్లి, పెద్దాపూర్, కంసానిపల్లి, తాడురు, పెనిమిళ్ల, ఉప్పరిపల్లి గ్రామాల్లో ఐకేపీ ద్వారా బుధవారం వరకు 119 మంది రైతుల నుంచి 6,384 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు ఏపీఎం తిరుపతయ్య తెలిపారు.



తూర్పార పడుతున్న రైతులు

పది రోజుల్లో వానాకాలం ప్రారంభం

మరో పది రోజుల్లో వానాకాలం ప్రారంభవుతుండంతో పొలం పనులు చేసుకోవాల్సి ఉంది. కానీ, ఇంకా కొనుగోలు కేంద్రాల్లోనే కాలం వెల్లదీస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తోడు ప్రతీ రోజు అకాలవర్షాలతో వడ్లు తడిసి నష్టపోతున్నామని రైతులు ఆరోపిస్తున్నారు. కొరటికల్ గ్రామంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి వడ్లు తడిసిపోవడంతో రైతులు లబోదిబోమం టున్నారు.

తూర్పార పట్టినా ...

కూలీలను పెట్టుకొని యంత్రాలతో వడ్లు తూర్పార పోసినా తాలు, తేమ శాతంతో ప్రతీ 40 కిలోల బస్తాకు ఒక కిలో 300 గ్రాములు తరుగు తీస్తున్నారు. సుతిలి దారాలతో పాటు 40 కేజీల బస్తాకు రూ.25 హమాలీ చెల్లిస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

తరుగు తీస్తాలేం

ప్రతీ 40 కేజీల బస్తాకు గన్నీ బ్యాగు తూకం కోసం ఒక కిలో 300 గ్రాములు తూకం వేస్తున్నాం తప్పా తరుగు కింద ఎక్కడా అధికంగా తూకం వేయడం లేదు. ఎక్కడైనా అలా అధికంగా తరుగు తీస్తే చర్యలు తీసుకుంటాం. రైతులకు అన్యాయం జరగనివ్వడం.

- రవీందర్‌రావు, పీఏసీఎస్ సీఈవో, ఉప్పునుంతల

హామీలు అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్ రావు



కొల్లాపూర్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్‌రావును సన్మానిస్తున్న ఆ పార్టీ నాయకులు, చిత్రంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్‌రావు

కొల్లాపూర్, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఆరు గ్యారెంటీల హామీలను అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్ రావు అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన తరువాతన తొలిసారి కొల్లాపూర్ పట్టణానికి విచ్చేసిన వేముల నరేందర్‌రావును జిల్లా మాజీ అధ్యక్షుడు, కొల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్ రావు ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు విలేకరులతో మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలోనే దేశ ప్రజలకు భద్రత ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో రాబోయే రోజుల్లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టడానికి ప్రతీ ఒక్కరు సిద్ధంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. ఈనెల 17 నుంచి దేశవ్యాప్తంగా దేశ సైనికుల వీరోచిత పోరాటానికి సంఘీభావంగా అమరులైన ఆర్మీ జవాన్‌లను స్మరిస్తూ తిరంగ్ యాత్ర ప్రారంభం కానున్నదని తెలిపారు. ఈనెల 20, 21 తేదీలలో జిల్లా కేంద్రాలలో 23 వరకు మునిసిపల్ కేంద్రాల్లో తిరంగ్ యాత్ర ఘనంగా నిర్వహించాలని సూచించారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్‌రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 1200 కోట్లతో త్వరలోనే సోమశిల కృష్ణానదిపై ఐకానిక్ వంతెన పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కల్లబొల్లి మాటలతో గద్దెనెక్కి కొల్లాపూర్ నియోజకవర్గానికి ఒరగబెట్టింది ఏమీ లేదని ఎద్దేవాచేశారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు తమటం శేఖర్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు కడ్తాల కృష్ణ, సందు రమేష్, జిల్లా నాయకులు తమటం సాయికృష్ణగౌడ్, మండల అధ్యక్షులు కేతూరి నారాయణ, పట్టణ అధ్యక్షులు కాడం శ్రీనివాసులు, యువజన మోర్చా జిల్లా అధ్యక్షుడు మూలే భరత్ చంద్ర, పాన్‌గల్ మండల అధ్యక్షులు అన్వేష్, పెద్దకొత్తపల్లి మండల అధ్యక్షుడు పదిర భీమేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా సఖి కేంద్రం



ఉపాధిహామీ కూలీలకు అవగాహన కల్పిస్తున్న సఖి సిబ్బంది

కోడేరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : గృహహింస, లైంగిక వేధింపులు,ఆర మనస్పర్థాలు తదితర సమస్యలు ఎదుర్కొంటున్న బాలికలు, మహిళలు సఖి కేంద్రాన్ని సంప్రదించాలని సఖికేంద్రం సిబ్బంది భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం మండల పరిధిలోనిఎత్తం, మైలారం, గ్రామాల్లో పర్యటించిన ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమం లో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

● పెద్దకొత్తపల్లి : పిల్లలు వాడే సామాజిక మాధ్యమాలపై తల్లిదండ్రులు దృష్టి కేంద్రీకరించాలని బాలల సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షుడు వై.లక్ష్మణరావు అన్నారు. చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ శ్రామిక వికాస కేంద్రం ఆధ్వర్యంలో పెద్దకొత్తపల్లిలో గురువారం పిల్లలపై ఆన్‌లైన్ వేధింపులకు గురి కాకుండా జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పిల్లల ప్రవర్తనలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. కార్యక్రమంలో సఖి సెంటర్ నిర్వాహకురాలు సునీత, డీసీపీయూ నుంచి సుదర్శన్, ఎస్‌వీకే ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ తిరుపాల్, ఐకేపీ ఏపీఎం అరుణ పాల్గొన్నారు.

20న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

కోడేరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 20న జరగునునన దేశ వ్యాప్త సమ్మెకు మద్దతుగా గ్రామీణ బంద్‌లో పాల్గొనడానికి మండలంలోని ఉపాధిహామీ పథకం సిబ్బంది, కూలీలు గ్రామ పంచాయతీ సిబ్బంది తరపున తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సీఐటీయూ మండల కమిటీల ఆధ్వర్యంలో ఎంపీడీవో శ్రావణ్‌కుమార్‌కు గురువారం సమ్మె నోటీసు ఇచ్చారు. సీపీఎం మండల కార్యదర్శి పి.నరసింహ మాట్లాడుతూ ఈ సమ్మెను కార్మిక, కర్షక కూలీలు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది జిలాని, రామస్వామి, శంకరమ్మ, కిరణ్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు .

● పెద్దకొత్తపల్లి : ఈ నెల 20న దేశవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం పెద్దకొత్తపల్లిలో అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ కార్మికులతో కలిసి సమ్మె కరపత్రాలను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఎం.దశరథం, వెంకటయ్య, బాలస్వామి, రాములు పాల్గొన్నారు.


● వంగూరు : ఈనెల 20న జరగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బాలస్వామి కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు.

పొలాలకు దారిచూపాలని పులిజాల గ్రామస్థుల వినతి

కందనూలు, మే 15 (ఆంధ్రజ్యోతి) : తమ వ్యవసాయ పొలాలకు దారి చూపించాలని నాగర్‌కర్నూల్ తహసీల్దార్‌కు మండలంలోని పులిజాల గ్రామ రైతులు మొర పెట్టుకున్నారు. పులిజాల గ్రామంలో సర్వే నెంబరు 109, 111, 26, 27, 28, 32, 132, 133, 138ల పరిధిలోని భూములకు వెళ్లే దారి ఆక్రమణకు గురైందంటూ రైతులు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేయడానికి వచ్చిన రైతులు ఎంబీ పార్వతిదేవి, ఎంబీ రమేష్‌కుమార్, సత్యం, రామచంద్రారెడ్డి, బి.జంగిరెడ్డి, బి.తిరుపతిరెడ్డి, సుభాష్‌రెడ్డి, బి.ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రసాయనాల వినియోగం తగ్గించుకోవాలి

- పాలెం వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు సిద్దప్ప, దివ్య



తాడూరు : సిర్సవాడలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ సిద్దప్ప

తాడూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : రసాయన ఎరువులు పరిమితికి మించి వాడరాదని, తద్వారా అధికదిగుబడి వస్తుందని పాలెం వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు డాక్టర్ సిద్దప్ప, దివ్య అన్నారు. గురువారం మండలం లోని సిర్సవాడ గ్రామ రైతువేదికలో రైతు ముం గిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో భాగం గా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించా రు. సాగునీటి వినియోగం, మొక్కల పెంపకం వంటి అంశాలపై ప్రత్యేకంగా రైతులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రతీ రైతు వ్యవసాయ భూమికి పశువుల పేడతో కూడిన ఎరువులు వాడినట్లయితే భూమి బలాన్ని పెంచినవారమవుతామన్నారు. కార్యక్రమంలో పాలెం కృషి విజ్ఞాన కేంద్రం కళాశాల సిబ్బందితో పాటు ఏవో సందీప్‌కుమార్‌రెడ్డి, ఏఈవో, గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి

కల్వకుర్తి : రైతులు భూసారాన్ని కాపాడుకునేందుకు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రీతి అన్నారు. గురువారం మండలంలోని పంజుగుల గ్రామంలో రైతుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏఈవో పాషా, యువ శాస్త్రవేత్తలు గ్రామ రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన అభయుడి ధర్మకర్తల మండలి

ఊర్కొండ, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి వారి ఆలయం ధర్మకర్తల మండలి చైర్మన్ సత్యనారాయణరెడ్డి పాలకమండలి సభ్యులతో కలిసి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనరసింహ, స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డిలను గురువారం హైదరాబాద్‌లోని వారి నివాసాల్లో కలిశారు. ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 19 నుంచి 21 వరకు హంపీ పీఠాధిపతులు జగద్గురు శంకరాచార్య శ్రీ విద్యారణ్యభారతీస్వామి వారిచే గణపతి, నవగ్రహ, ధ్వజస్తంభ, కళశ ప్రతిష్ఠా కుంభాభిషేకం కార్యక్రమాల ఆహ్వాన పత్రికను అందజేశారు. కలిసిన వారిలో పీఏ సీఎస్ మాజీ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి పాలక మండలి సభ్యులు, అర్చకులు దత్తాత్రేయశర్మ, మహేష్ శర్మ తదితరులు ఉన్నారు.

మానసిక దివ్యాంగులతో సుహృద్భావంతో మెలగాలి

తెలకపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి) : మానసిక వైకల్యం కలిగిన వ్యక్తుల పట్ల సహృద్భావంతో మెలగాలని డిప్యూటీ చీఫ్ లీగలేట్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య అన్నారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నాగర్‌కర్నూల్ చైర్మన్ మరియు సెక్రటరీ ఆదేశాల మేరకు మండల పరిధిలోని రాకొండ గ్రామపంచాయతీలో నిర్వహించిన నాల్సా లీగల్ సర్వీసెస్ పర్సన్స్ విత్ మెంటల్ ఇల్నెస్ అండ్ పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిజేబిలిటీస్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీరామ్ ఆర్య హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి అనిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధితురాలికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

పెద్దకొత్తపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సాతాపూర్ గ్రామానికి చెందిన గన్నోజు రాధా గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమెకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.60వేలు మంజూరయ్యాయి. ఆ చెక్కును బాధితురాలికి కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు శివ రాజేశ్వర్‌రావు అందజేశారు. కార్యక్రమంలో ఆ గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యులు నారాయణ రావు, జూపల్లి యువసేన నాయకులు హరిపల్లి అర్జున్‌యాదవ్ పాల్గొన్నారు.

సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన కల్పించాలి

వెల్దండ, మే 15 (ఆంధ్రజ్యోతి) : సికిల్ సెల్ వ్యాధిపై ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించాలని జిల్లా సికిల్‌సెల్ నోడల్ అధికారి డాక్టర్ ప్రదీప్‌కుమార్ వైద్యసిబ్బందికి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సికిల్‌సెల్ వ్యాధిపై ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు, పర్యవేక్షణ సిబ్బందికి అవగాహన, స్క్రీనింగ్ పరీక్షలపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ప్రదీప్‌కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో డాక్టర్ సింధు, ఏపీవో నిరంజన్, డివిజన్ ఉప మలేరియా అధికారి పర్వతాలు, ఎంఎల్‌హెచ్‌పీలు డాక్టర్ నవీన్, యాదయ్య, సాయిపవన్, సూపర్‌వైజర్లు మురళి, కవిత ఉన్నారు.

రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు త్వరగా పరిశీలించాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల వెరిఫికేషన్ వేగంగా జరగరాలని కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించిన లబ్ధిదారుల డెస్క్ వెరిఫికేషన్, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియపై బ్యాంకర్స్, హౌసింగ్ అధికారులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో అదనపు కలెక్టర్ దేవసహాయంతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులకు లబ్ధి చేకూరే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల అర్హుల తుది జాబితాను నియోజకవర్గ ఎమ్మెల్యేల అనుమతితో సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



దోమలపెంటలో నూతన మోటారు పంపులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

దోమలపెంట, మే 15 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. గురువారం దోమలపెంటలో 40హెచ్‌పీ సామర్థ్యం గల రెండు మోటారు పంపులను ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత కాలంగా దోమలపెంట, ఈగల పెంట గ్రామాలలో నెలకొన్న తాగునీటి సమస్యను అధిగమించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, నూతనంగా ప్రారంభించిన రెండు మోటారు పంపులతో తాగునీటి సమస్యకు కొంత వరకు ఉపశమనం కలుగుతుందన్నారు. మరో రెండు నెలలో మిషన్ భగీరథ పనులను పూర్తి చేసి ఇంటింటికీ నల్లాల ద్వారా నీటి సరఫరా చేస్తామని ఆయన పేర్కొన్నారు. అనంతరం దోమలపెంలో మార్కండేయ దేవాలయంలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సుధాకర్ సింగ్, డీఈ హేమలత, అమ్రాబాద్ జడ్పీటీసీ మాజీ సభ్యురాలు డాక్టర్ అనురాధ, స్థానిక నాయకులు కిషన్, చత్రునాయక్, మోయిజొద్దీన్, గురువయ్య, హరినారాయణగౌడ్ పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకం లాభదాయకం

- పీవీ నర్సింహారావు తెలంగాణ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ సాయిరెడ్డి

దోమలపెంట, మే 15 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అటవీ ప్రాంతంలోని చెంచులకు పెరటి కోళ్ల పెంపకం లాభదాయకంగా ఉంటుందని పీవీనర్సింహారావు తెలంగాణ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్. సాయిరెడ్డి అన్నారు. గురువారం అమ్రాబాద్ మండలం సార్లపల్లిలో పెరటి కోళ్ల పెంపకంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. వ్యవసాయంతో పాటు అనుబంధంగా పెరటికోళ్ల పెంపకం ద్వారా కుటుంబ పోషణకు దోహదపడుతుందన్నారు. త్వరలోనే ప్రభుత్వం ట్రైబల్ సబ్‌ప్లాన్ ద్వారా కోళ్ల పంపిణీ చేస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ జ్ఞాన శేఖర్, డాక్టర్ రాజు, చెంచులు పాల్గొన్నారు.

హక్కుల సాధన కోసం బీసీలు ఉద్యమించాలి

- 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధన జేఏసీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ అజయ్‌కుమార్ యాదవ్

పెద్దకొత్తపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): బీసీలు తమ హక్కుల సాధన కోసం సంఘటితంగా ఉద్యమించాలని 42శాతం బీసీ రిజర్వేషన్ సాధన జేఏసీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ అజయ్ కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం పెద్దకొత్తపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీల ఐక్యత వర్ధిల్లాలని, మహాత్మా జ్యోతిబాపూలే, బాబాసాహెబ్ అంబేడ్కర్, బీపీ మండల్ లాంటి మహానీయుల కలలు కన్న ఆశయాల సాధన కోసం ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. దేశ జనాభాలో 56శాతానికి పైగా బీసీల జనాభా ఉందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు రాజ్యాంగపరంగ సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా రావాల్సిన వాటాను ఇవ్వడానికి ప్రభుత్వాలు సంతోషంగా సహకరించడం లేదని విచారం వ్యక్తం చేశారు.

ఈనెల 18వ తేదీన కొల్లాపూర్ పట్టణంలోని సురభిరాజా బంగ్లా వద్ద చేపడుతున్న ఒక్క రోజు రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో బీసీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ శివార్చక విజయ్‌కుమార్, జేఏసీ నాయకులు శివశంకర్ యాదవ్, బీసీ జన చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ తదితరులు అన్నారు.

‘కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు రావొద్దు’

తెలకపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు రాకూడదని నాగర్‌కర్నూల్ ఆర్డీవో సురేష్ అన్నారు. గురువారం సాయంత్రం తెలకపల్లి వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ జాకీర్‌అలీతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యాన్ని నిబంధనల ప్రకారం శుభ్రపర్చి కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కనీస సౌకర్యాలను కల్పించాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలిం చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జాకీర్‌ఆలీ, కొనుగోలు నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి : ఆర్డీవో శ్రీను

కల్వకుర్తి, మే 15 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కల్వకుర్తి ఆర్డీవో శ్రీను అన్నారు. గురువారం కల్వకుర్తి మండలం పంజుగుల, ముకురాల గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను ఎమ్మార్వో ఇబ్రహీంతో కలిసి పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ ఉన్న ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు చేరవేయాలని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనలకనుగుణంగా రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకొచ్చి గిట్టుబాటు ధరను పొందాలని తెలిపారు. అనంతరం కొనుగోలు కేంద్రాల వద్ద వస్తున్న ఇబ్బందులు, సంచుల కొరత రవాణా తదితర అంశాలపై ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో వెంకటరెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారి పాషా, సిబ్బందితో చర్చించారు.

చిరు వ్యాపారుల షెడ్లను కూల్చడం అన్యాయం

- బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్

నాగర్‌కర్నూల్ టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీకి తైబజారు చెల్లించి ఫుట్‌పాత్‌ల పైన వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారుల షెడ్లను కూల్చడం అన్యాయమని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్ అన్నారు. గురువారం బీఎస్పీ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం మేనేజరుకు వినతిపత్రం అందజేశారు. రాంచందర్ మాట్లాడుతూ చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ మార్గాలను చూపించాలని కోరారు.

● సీపీఎం నాగర్‌కర్నూల్ మండల కార్యదర్శి రామయ్య ఆధ్వర్యంలో మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒకవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిరువ్యాపారులకు జీవనోపాధి కల్పిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటూ దుకాణాలు కూల్చివేతలతో వారి జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఆలోచించి చిరువ్యాపారులకు షెడ్లను నిర్మించి జీవనోపాధి కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు పృథ్వీరాజ్, కళ్యాణ్, పరశురాం, నాగరాజు, మధు, బాలనాగులు, రాములు, సీపీఎం నా యకులు అశోక్, మధు, సుభాష్, సురేష్ పాల్గొన్నారు.

అర్థవంతమైన విద్యాబోధనతోనే ఉత్తమ ఫలితాలు

- డీఈవో రమేష్ కుమార్



బిజినేపల్లిలో ఆంగ్ల బోధన ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఈవో ఏ రమేష్ కుమార్

బిజినేపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్థవంతమైన విద్యాబోధన చేపడితేనే ఉత్తమ ఫలితాలు వస్తాయని డీఈవో ఏ.రమేష్ కుమార్ అన్నారు. బిజినేపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణా తరగతులను గురువారం డైట్ కళాశాల ప్రిన్సి పాల్ మిరాజుల్లాఖాన్‌తో కలిసి ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల బోధన నైపుణ్యాలు పెంపొందించేందుకు చేపట్టిన వృత్యంతర శిక్షణను సద్వినియోగం చేసుకో వాలని సూచించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి కుర్మయ్య, ఎంఈవో రఘునాథ్ శర్మ, సెక్టోరియల్ అధికారి వెంకటయ్య, డీఆర్పీలు, సీఆర్పీలు మల్లేష్, శేఖర్, సాంబశివుడు, బాల య్య, మురళి, తిరుపతి పాల్గొన్నారు.